క్లుప్తంగా

సెల్‌ఫోన్ జోలికి పోవద్దు

ఎంఈఓ నర్సింగ్‌రావు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింగ్‌రావు

తాండూరు రూరల్: మూడు నెలల్లో పదో తరగతి పరీక్షలు మొదలు కాబోతున్నాయని విద్యార్థులు సెల్‌ఫోన్ జోలికి వెళ్లొద్దని పెద్దేముల్ ఎంఈఓ నర్సింగ్‌రావు సూచించారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి జీవితంలో పదోతరగతి కీలకమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పదిలో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

లగచర్లలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



లగచర్లలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్ల గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుంది. సర్వే సమయంలో లగచర్ల గ్రామంలో అధికారులపై దాడి జరగడంతో భయంతో గ్రామానికి చెందిన చాలా కుటుంబాలు ఊరు విడిచి వెళ్లి పోవడంతో సర్వే చేయలేదని అధికారులు తెలిపారు. శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడంతో ఎన్యుమరేటర్లు అరుణ, శ్రీలత వివరాలు నమోదు చేశారు. దాడి ఘటనలో ఏ2 నిందితుడు సురేశ్ కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయలేదని ఎన్యుమరేటర్లు తెలిపారు.

పట్టణ అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



పనులను ప్రారంభిస్తున్న అశోక్‌కుమార్

పరిగి: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలో ఎస్సీ శ్మశాన వాటిక పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని ఎర్రగడ్డపల్లి, సుల్తాన్‌నగర్ కాలనీవాసుల కోసం రూ.4లక్షల నిధులతో శ్మశాన వాటికను నిర్మిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. త్వరలో పట్టణంలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్డు పనులు చేపడుతామన్నారు. పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. పట్టణ ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగేశ్వర్, శ్రీనివాస్, వెంకటయ్య పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లతో విద్యార్థినులు

అనంతగిరి: విద్యార్థినులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశ్యంతో సైకిళ్ల పంపిణీ చేశామని సర్వోదయ మిత్ర మండలి ట్రస్టు సభ్యులు కన్నె అశోక్ పేర్కొన్నారు. శనివారం గొట్టిముక్కల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లోని విద్యార్థినులకు సర్వోదయ మిత్ర మండలి ట్రస్టు ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు బాలికలకు సైకిళ్ల పంపిణీ చేసినట్లయితే శారీరక ఆరోగ్యంతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించగలమనే ప్రతిపాదన మేరకు రోటరి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఫ్రైడ్, రోటరీ క్లబ్ ఆఫ్ స్మార్ట్ హైదరాబాద్ సహకారంతో ఏడు సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. అనంతరం రోటరీ క్లబ్ యాజమాన్యానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు వేమారెడ్డి, రతన్, మహేందర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వివరాల నమోదు పూర్తి

15,163 ఇళ్ల సమాచారం సేకరించిన ఎన్యుమరేటర్లు

- దోమ మండలంలో 98 శాతం డేటా నమోదు
- రెండు రోజుల్లో పూర్తి కానున్న ప్రక్రియ



సమగ్ర కుటుంబ సర్వేను నమోదు చేస్తున్న అధికారులు

దోమ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు పకడ్బందీగా నిర్వహించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఆర్థిక, ఉపాధి, కుల సర్వేను వందశాతం పూర్తి చేశారు. నవంబర్ 6నుంచి ఇళ్ల గుర్తింపుతో చేపట్టిన ప్రక్రియను దాదాపు నెల రోజుల పాటు చేపట్టారు. మొదట ఇళ్ల గుర్తింపు చేసిన అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. దోమ మండలంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, రిజర్వ్ సూపర్‌వైజర్లను అధికారులు నియమించారు. దీంతో వారు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. వారం క్రితమే సర్వే పూర్తి కాగా, తీసుకున్న వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేసే ప్రక్రియను ముమ్మరంగా చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రత్యేకంగా నియమించి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను అధికారులు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

తేలిన కుటుంబాల లెక్క

మండలంలో మొత్తం 36 గ్రామ పంచాయతీలు వాటి అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటిలో 94 మంది ఎన్యుమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లు ఆయా గ్రామాలు, మారుమూల పల్లెలకు వెళ్లి సర్వేను నిర్వహించారు. మండల వ్యాప్తంగా మొత్తం 15,163 ఇండ్లు గుర్తించారు. ప్రతి ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు.

సభ్యులు ఎక్కువగా ఉంటే.. అరగంట

సర్వే నమోదును అధికారులు వేగవంతం చేశారు. మొత్తం 69 లాగిన్‌లు ఇవ్వగా, అందులో కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన దాదాపు 55 మందిని ఎంపిక చేసి ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఎన్యుమరేటర్లు సర్వే చేసిన ఫారాల ఆధారంగా ఆన్‌లైన్లో నమోదు చే స్తున్నారు. ఒక్కో కుటుంబానికి 10 నుంచి 15 నిమిషాల సమయం పడుతోంది. అయితే కుటుంబ సభ్యులు అధికంగా ఉంటే అరగంటకు పైగానే సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే సర్వే నమోదు 98 శాతం పూర్తయినట్లు మరో రెండు శాతం కూడా సోమవారం లోపు పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు.

పకడ్బందీగా నిర్వహించాం



సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాం. మొత్తం మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామానికి ఎన్యుమరేటర్లను నియమించి సర్వేను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికి సర్వే నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలతో 98 శాతం పూర్తి చేయగా, మరో రెండు రోజుల్లో వందశాతం పూర్తవుతుంది.

– మహేశ్‌బాబు, ఎంపీడీఓ, దోమ

ఉద్యోగాలు ఇవ్వాలని వినతి

ఎమ్మెల్యేకు అందజేత



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

తాండూరు రూరల్: 61 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీఆర్‌ఏ వారసులకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని కోరారు. శనివారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి రాంపూర్‌తండాలో నిర్వహించిన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడారు. గత ప్రభుత్వం 2020న సెప్టెంబర్‌లో వీఆర్‌ఏలకు పేస్కేల్, వారసులకు కారుణ్య నియామకాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. వీఆర్‌ఏల సమస్యలు పరిష్కా రం కోసం జీవో 81, 85ను విడుదల చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 వేలకు పైగ వీఆర్‌ఏలను విద్యా అర్హతనుబట్టి 16 వేల మందిని వివిధ శాఖల్లో అప్పటి ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ఇంక రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన 3 వేలకు పైగ వీఆర్‌ఏ వారసులకు నియామకాలు చేపట్టకుండా 16 నెలల నుంచి కాలయాపన చేస్తుందన్నారు. 9వ తేదీ నుంచి ప్రారంభంకానున్న అసెంబ్లీ సమావేశంలో ఈ విషయం గురించి మాట్లాడాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. వీఆర్‌ఏల జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు జనార్ధన్, వెంకటేశ్, నర్సిములు, కాశప్ప, గోపాల్, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ



చిన్నారుల బరువు కొలుస్తున్న జయశ్రీ

దుద్యాల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని, టీచర్లు సమయపాలన పాటించాలని దుద్యాల్ మండలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 3, 4, 6వ అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బరువు, ఎత్తు కొలిపించారు. అనంతరం ఆమె మాట్లాడారు. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరన్నారు. టీచర్లు అందుబాటులో ఉండాలని, లేదంటే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతి కేంద్రం తెరిచి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రత్నబాయి, నవనీత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న హోంగార్డులు

అనంతగిరి: సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి శనివారం వికారాబాద్ జిల్లా హోంగార్డులు క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం హోంగార్డుల రోజువారి వేతనం రూ.వెయ్యి, వీక్లిపరేడ్ అలవెన్స్ రూ.200, మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం తదితర హామీలను ప్రకటించిన నేపథ్యంలో వికారాబాద్ జిల్లా హోంగార్డుల సంఘం ఆధ్వర్యంలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడారు. అనంతరం సీఎం నిర్ణయానికి హోంగార్డులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు



పూడూరులో విద్యార్థులతో ఉపాధ్యాయులు

దోమ: రాంకొండా ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు రఘుపతిరెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ఒకరోజు పాఠాలు బోధించడం సంతోషకరమన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెన్నయ్య, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో మెలగాలని మండల విద్యాధికారి సాయిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. అనంతరం సాయిరెడ్డి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. స్వయం పరిపాలన దినోత్సవంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రత్న, పాఠశాల హెచ్‌ఎం అంజిలయ్య, జీహెచ్‌ఎం వెంకటేశం, ఏఏపీసీ చైర్మన్ ఫరీద, ఉపాధ్యాయులు పుష్పలత, లక్ష్మి, నిఖిల, అస్మాబేగం, సుమంత్, క్రిష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం



తాండూరు రూరల్: విరాళం అందజేస్తున్న ఆర్‌సీ గౌడ్



బంట్వారం: గ్రామస్తులకు విరాళం అందిస్తున్న అనిల్

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్(ఆర్‌సీ)గౌడ్ విరాళం అందజేశారు. శుక్రవారం గ్రామానికి చెందిన శివాజీ యువజన సంఘం సభ్యులకు రూ.1,11,000 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మల్కాపూర్ గ్రామ అభివృద్ధికి తనవంతు సహాయం అందజేస్తానని ఆర్‌సీగౌడ్ తెలిపారు.

బంట్వారంలో..

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయ నిర్మాణానికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ శనివారం రూ. 21వేలు విరాళంగా గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గ్రామస్తులు, నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ అనిల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లయ్య, లింగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెట్లకుంటలో సాగుకు సిద్ధం

తైబందు ఖరారుతో రైతన్న ఆనందం



తెబందు సమావేశంలో నాయకులు

బొంరాస్‌పేట: మండలంలోని రైతులు ఈ ఏడాది సకాలంలోనే సాగు చేశారు. శనివారం మండల పరిధిలోని మెట్లకుంటలో రైతులు సమావేశం నిర్వహించారు. ఎల్లమ్మ చెరువు నిండి నీరు పుష్కలంగా ఉండటంతో ఈ సారి యాసంగికి (రబీ) ఆయకట్టులో వరిపంట సాగుకు సిద్ధమయ్యారు. పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన తైబంది సమావేశంలో ఆయకట్టులో వ్యవసాయం చేసుకోవడానికి సమావేశం ఖరారు చేసింది. దీంతో రైతన్న ఆనందం వ్యక్తం చేశారు. ఆయకట్టు పరిధి పొలాలకు కాల్వలను మరమ్మతు చేసి పంటల సాగులో ఆదర్శం కావాలని సూచించారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు నాయుడు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

మొయినాబాద్: విద్యార్థులు భవిష్యత్ నిర్మాణానికి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్య సాధనవైపు అడుగులు వేయాలని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాల నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ మొయినాబాద్‌లోని పద్మావతి గార్డెన్‌లో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లోకసాని శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో ఓటరు లిస్టు



నోటీస్ బోర్డుపై ఓటరులిస్టు ప్రకటిస్తున్న అధికారులు

కుల్కచర్ల: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ఓటరు లిస్టును అధికారులు ప్రకటించారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణ మండల పరిధిలోని ఓటరు లిస్టును ప్రకటన బోర్డులో ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల పరిషత్‌లో 45 గ్రామపంచాయతీలకు గాను 380వార్డులు ఉన్నాయని ఇందులో 25,084 పురుష ఓటర్లు, మహిళలు 25,009, ఇతరులు 4గురు ఉన్నారని పేర్కొన్నారు. మొత్తంగా 50,097మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ లిస్టులో ఎవరికైనా ఏదైనా సందేహాలు ఉన్నట్లయితే స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీఓ భాస్కర్, జీపీ సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంకులు!

- కూలేందుకు సిద్ధం..
- ఆందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్

దుద్యాల్: మండలంలోని గౌరారం, నాజుఖాన్‌పల్లి, హస్నాబాద్ గ్రామాల్లో నిరుపయోగంగా వాటర్ ట్యాంకులు తయారయ్యాయి. అవి పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. వాటర్ ట్యాంకులు ఎప్పుడు కూలుతుందోననే భయంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గౌరారం గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా తయారై, చుట్టూ పిచ్చిమొక్కలను అల్లుకుని ఉంది. దీంతో అక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హస్నాబాద్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని వాటర్ ట్యాంకు కూలే పరిస్థితిలో ఉందని చెబుతున్నారు. ప్రమాదవశాత్తు అది కూలితే పాఠశాలపై పడే అవకాశం లేకపోలేదు. గతంలో పలు మార్లు పరిశీలనకు వచ్చిన అధికారులకు విద్యార్థులు, గ్రామస్థులు ట్యాంకులను కూల్చి నూతన నిర్మాణం చేపట్టాలని వారి దృష్టికి తెచ్చిన ఫలితం లేకుండా పోయింది. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. నాజుఖాన్‌పల్లి గ్రామంలో వాటర్ ట్యాంకు కూడా శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి విషయంలో ప్రమాదాలు సంభవించకముందే అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌లను కూల్చేసి వాటి స్థానే నూతన నిర్మాణలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



గౌరారంలో పిచ్చిమొక్కలతో నిండిన వాటర్ ట్యాంక్



నాజుఖాన్‌పల్లిలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

మార్కెట్‌కు 5,438 సంచుల ధాన్యం రాక



మార్కెట్‌కు వచ్చిన ధాన్యం

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు 5,438 సంచుల సన్న, దొడ్డు రకం ధాన్యం వచ్చిందని ఏఎంసీ కార్యదర్శి సిద్ధమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నిర్వహించిన బీట్లలో ధాన్యంలో సోనా రకం వడ్లు 4,194 సంచులు వచ్చాయని క్వింటాల్‌కు తక్కువ రూ. 2,430, మధ్యస్తంగా రూ. 2,600, అత్యధికంగా రూ. 2,720 వరకు ధర పలికిందని ఆమె తెలిపారు. వరిలో 1010 రకం వడ్లు 1,244 సంచులు వచ్చాయని పేర్కొన్నారు. క్వింటాల్‌కు రూ. 2,200, రూ. 2,240, రూ. 2,260 వరకు అమ్మకాలు నిర్వహించారని తెలిపారు. అలాగే 100 సంచుల మొక్కజొన్న వచ్చిందని, బీట్లలో క్వింటాల్‌కు రూ. 2,360, రూ. 2,420, రూ. 2,460 ధర పలికిందని ఆమె పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పర్యాటన

పెద్దేముల్: పెద్దేముల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పర్యాటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కందెనెల్లి గ్రామం నుంచి మంచన్‌పల్లి గ్రామం వరకు పలు గ్రామాల్లో అభివృద్ధి శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. దీనికి వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు హాజరుకావాలని కోరారు.